క్లుప్తంగా

ఈ- క్రాప్ నమోదును పరిశీలించిన జేసీ



ఈ-క్రాప్‌ను పరిశీలిస్తున్న జేసీ ధాత్రిరెడ్డి

దెందులూరు: ప్రతి రైతు తప్పనిసరిగా తమ భూమిలో వేసే పంటల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని ఏలూరు జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి సూచించారు. పంట నష్టం, ప్రభుత్వ పథకాలు, ప్రకృతి విపత్తుల సమయంలో నష్ట పరిహారం అందుకునేందుకు ఈ- క్రాప్ నమోదు అర్హతగా ఉపయోగపడుతుందని తెలిపారు. సోమవారం మండలంలో చేపట్టే ఈ-క్రాప్ సూపర్ చెక్‌ను పోతునూరులో జేసీ పరిశీలించారు.

రీసర్వే పనుల తనిఖీ



రీ సర్వేను తనిఖీ చేసిన ఆర్డీఓ అంబరీష్

దెందులూరు: భూ రీ సర్వే పనులు వేగవంతం కావాలని ఏలూరు ఆర్డీఓ అచ్యుత అంబరీష్ అన్నారు. సోమవారం దెందులూరు మండలం మలకచర్లలో జరుగుతున్న భూ రీసర్వే పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామంలో మొత్తం పొలాలు ఎప్పటివరకు రీసర్వే చేసే కార్యక్రమంలో రైతుల సహకారంతోపాటు ఇతర వివరాలు సిబ్బందిని ఆర్డీఓ అడిగి తెలుసుకున్నారు. దెందులూరు తహసీల్దార్ బీ.సుమతి, మండల సర్వేయర్ రమణా రావు ఉన్నారు.

ర్యాగింగ్ జోలికి వెళ్లొద్దు



యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దెందులూరు: ర్యాగింగ్ జోలికి ఏ ఒక్కరూ వెళ్లొద్దని ఏలూరు పీఠం వికార్ జనరల్ సెయింట్ జోసెఫ్ విద్యాసంస్థల ప్రిన్సిపల్ డాక్టర్ ఫాదర్ పి.బాల అన్నారు. సోమవారం సోమవరప్పాడు సెయింట్ జాన్స్ విద్యా సంస్థల్లో యాంటీ ర్యాగింగ్ డే సమావేశం అనంతరం ర్యాలీ నిర్వహించారు. వికార్ జనరల్ ఫాదర్ బాల జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ర్యాలీ అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదమ్ముల్లా స్నేహపూరిత వాతావరణంలో కలిసిమెలిసి ఉండాలన్నారు. బాహ్య ప్రపంచంలోకి వెళ్లి ఉజ్వల భవిష్యత్తు సాధించాలన్నారు. ర్యాగింగ్ భూతం జోలికి వెళితే భవిష్యత్తు కోల్పోవడమే కాకుండా ఆ కుటుంబ సైతం సమాజంలో అవమానాలకు గురవుతుందన్నారు. ప్రభుత్వ సైతం ర్యాగింగ్‌కు పాల్పడిన, సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి కళాశాల విద్యాసంస్థల్లో సీసీ కెమెరాలు ఇటువంటి కార్యక్రమాలను చిత్రీకరించేలా ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

నేటి నుంచి కొవ్వలిలో దీవెన పండుగలు

దెందులూరు: కొవ్వలి అంబేడ్కర్ కమ్యూనిటీ హాల్లో మంగళవారం నుంచి బేతేలు సువార్త సహవాసం ఆధ్వర్యంలో దీవెన పండుగలు నిర్వహించనున్నట్లు పాస్టర్ వీహెచ్‌ఏ విలియం అన్నారు. సోమవారం చర్చిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ 11, 12, 13,14 తేదీల్లో ప్రతిరోజు ఉదయం 10గంటలకు సాయంత్రం 6 గంటలకు ప్రార్థనలు జరుగుతాయన్నారు. వాక్య పరిచర్య చేయడానికి పాస్టర్ మాథ్యూ, పాస్టర్ జాషువా పాస్టర్ జబరాజ్ పాస్టర్ స్టీఫెన్‌సన్ అతిథులుగా విచ్చేసి వాక్య పరిచర్య అందిస్తారన్నారు. సమీప మండలాల్లోని విశ్వాసులు నాలుగు రోజులు పాటు నిర్వహించనున్న దీవెనలు పండుగలకు హాజరుకావాలని పాస్టర్ నిర్వాహకులు విలియం కోరారు.

భక్తిశ్రద్ధలతో మూక పంచశతి పారాయణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారం పేరయ్య కోనేరు ప్రాంగణంలో 93వ వార్షిక రామకోటి మహోత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం 7 నుంచి 8 గంటల వరకు విశ్వశాంతి సమాజం సభ్యుల ఆధ్వర్యంలో మౌన ధ్యానం, భక్తి గీతాలు, హరేరామ సంకీర్తనలు నిర్వహించారు. స్వామి వారికి సహస్ర నామ పూజలు, నిత్య హోమం, నిత కల్యాణం నిర్వహించారు. ప్రాంగణంలోని శ్రీరామ మందిరంలో ఉదయం 7 గంటలకు పునర్వసు నక్షత్రం పర్వదినం సందర్భంగా మూలవిరాట్‌లకు అభిషేకం చేశారు. స్వామివారికి విశేష అలంకరణ చేసి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం నగరానికి చెందిన దుర్గా సప్తశతి బృందంచే పాదర్తి జ్యోతి ఆధ్వర్యంలో మూక పంచశతి పారాయణ నిర్వహించారు.

కాకర్లమూడి సర్పంచ్ మృతి

ఉంగుటూరు : కాకర్లమూడి సర్పంచ్ కాళ్ల నాగపండు (48) ఆదివారం రాత్రి ఇంటి వద్దనే హఠాత్తుగా అనారోగ్యానికి గురై మృతి చెందారు. నాగపండు మృతికి ఎమ్మెల్యే ధర్మరాజు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు.

మినుము, పెసరకు మూషికాల బెడద

- భారీగా నష్టపోతున్న రైతులు
- ఎలుకలను పట్టేవారికి పెరిగిన డిమాండ్

పెదవేగి : మినుము, పెసర సాగులో ఎలుకల ప్రభావం అధికమవుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా మినుము, పెసర సాగు చేస్తున్నారు. వరి కంటే అపరాల పంటల్లోనే ఎలుకల ఎక్కువగా ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం పంటలు ఈనిక దశలో ఉన్నాయి. ఈ దశలో ఎలుకల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రైతులు అప్రమత్తం కాకుంటే పంటకు భారీగా నష్టం వాటిల్లుతుంది. రబీలో బుట్టలతో ఎలుకలను రైతులు పట్టిస్తున్నారు. ఎలుకల బుట్టలు పెట్టే వారికి డిమాండ్ పెరిగింది. ఎకరానికి 35–45 ఎలుకలు దొరుకుతున్నాయని వారంటున్నారు. ఎలుకలను పట్టేందుకు బుట్టలు పెట్టే చోట గుర్తుకు గుచ్చే పెగ్‌లను వాళ్లే తయారు చేసుకుంటారు.

ప్రత్యేక నేర్పరులు రాక

ఎలుకలను పట్టే ప్రత్యేక నేర్పరులు ఉండి మండలం పాందూరు, తెనాలి నుంచి పెదవేగి మండలంలోని సూర్యారావుపేట, దెందులూరు వచ్చారు. మినుము మొక్కలు గుబురుగా, దట్టంగా పెరిగిన చోట ఎలుకలు స్థావరాలు ఏర్పాటు చేసుకోవటానికి అనుకూలంగా ఉంటుందని ఎలుకలు పట్టే వారు దగరపు భాస్కరరావు, చెక్కా పెద్దిరాజు, ఆర్ వెంకటేశ్వర్లు, గారపాటి ప్రసాద్‌లు తెలిపారు. గింజలు తయారయ్యాక వాటిని నాశనం చేసి, బొరియల్లోకి తీసుకెళ్తాయని చెబుతున్నారు.

ఎలుకలు తినేది తక్కువ, పాడు చేసేది ఎక్కువని అన్నారు. ఎకరాకు అర బస్తా మినుము వరకూ పంట నష్టం ఉంటుందని, రోజుకు ఎకరానికి 35 నుంచి 45 వరకు ఎలుకల్ని పడుతున్నామన్నారు. తక్కువ ఎలుకలు పడితే రూ.20 వస్తుందని, ఎక్కువ పడితే రూ.15, రూ.18 చొప్పున రైతులు ఇస్తారని వారు చెబుతున్నారు. రోజుకు ఒకొక్కరికీ రూ.500 నుంచి రూ.800 వరకు గిట్టుబాటు అవుతుందని చెబుతున్నారు. రైతులు వేసిన పంట చేతికి వచ్చే సమయానికి ఎలుకల బెడద ఎక్కువగా ఉంటుందని ఆ సమయంలో తమకు పని దొరుకుతుందని, సాగు లేనప్పుడు తమ జీవనం అస్తవ్యస్తంగా ఉంటుందన్నారు. ప్రభుత్వం తమలాంటి వారందరికీ రుణాలు అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.



పొలంలో ఎలుకలను పట్టేందుకు బుట్టలు పెడుతున్న కూలీ



ఎలుకను పట్టేందుకు బుట్టలతో సిద్ధం

సీజన్‌లోనే ఆదాయం

పంటల సమయంలో ఎలుక బుట్టలు పెట్టి వచ్చిన ఆదాయంతో కడుపు నింపుకుంటున్నాం. సీజన్ ముగిసిన తరువాత ఏ పనీ చేయలేక, పస్తులు ఉండాల్సి వస్తోంది. ప్రభుత్వం మాలాంటి వారికి ఏదొక పథకం ద్వారా దారి చూపాలి.

– ఆర్ వెంకటేశ్వర్లు, తెనాలి

ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం తథ్యం



భీమడోలులో మాట్లాడుతున్న ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి, ఎంఈవో భాస్కర్‌కుమార్

భీమడోలు: పరీక్షల భయాన్ని వీడి ప్రణాళికాబద్ధంగా చదివితే ప్రతి ఒక్కరూ విజయం అందుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. భీమడోలు ఉన్నత పాఠశాలలో సోమవారం పీఎం నరేంద్ర మోడీ ప్రసంగం ప్రత్యక్ష ప్రసారం ద్వారా చిన్నారులకు పరీక్షలంటే భయం పోగొట్టేలా సందేశాన్ని అందించారు. ఆ సందేశాన్ని విద్యార్థులతో కలిసి ఎంపీడీవో, ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్ తిలకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థులు చదివే విషయంలో మెలకువలను పాటించాలని, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే సబ్జెక్టులపై పట్టు సాధిస్తారన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు త్వరలో పరీక్షలు జరుగుతున్నాయని, వాటికి ప్రణాళితో సంసిద్ధులు కావాలన్నారు. పౌష్టికాహారం, ఆరోగ్య సూత్రాలను పాటించాలని కోరారు. తొలుత పాఠశాలలోని బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అచ్చమ్మ తల్లి సన్నిధిలో అబ్బయ్యచౌదరి, జేపీ

దెందులూరు: గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలు తల్లి సన్నిధికి దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏలూరు నియోజకవర్గ సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ సోమవారం అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకున్నారు. అబ్బయ్య చౌదరి, జయప్రకాష్‌కు ఆలయ కమిటీ ఆలయ ప్రధాన అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం ప్రధాన అర్చకులు శర్మ ఇరువురికీ శేష వస్త్రం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ అబ్బాయి చౌదరికి, జయప్రకాష్‌కు అమ్మవారి జ్ఞాపకను అందజేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి జ్ఞాపికను ఇరువురికి అందజేశారు. వీరి వెంట దెందులూరు ఏలూరు నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యేను అబ్బయ్యచౌదరిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

వైభవంగా అమ్మవార్ల జాతర



భీమడోలులో అమ్మవార్ల ఊరేగింపు

భీమడోలు: భీమడోలులో గ్రామదేవతలుగా విరాజిల్లుతున్న మద్దిరామమ్మ, మహాలక్ష్మమ్మ, గంగానమ్మ, పోతురాజు జాతర మహోత్సవ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. జాతర ఉత్సవ కమిటీ అధ్యక్షుడు దత్తాడ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో 12 ఏళ్లకు ఒకసారి వచ్చే జాతర ఉత్సవాల్లో భాగంగా నాల్గవ రోజు సోమవారం అమ్మవార్లు, పోతురాజు గ్రామోత్సవం కనుల వేడుకగా నిర్వహించారు. అమ్మవార్ల ఘటాలతో ఇంటింటికీ వెళ్లిన గణాచారులకు భక్తులు వస్త్రాలు పరిచి స్వాగతం పలికారు. తొలుత ఆలయ ప్రాంగణంలో గణాచారులు కలిసి పంబల వారు అమ్మవార్లకు సంబరం నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవార్లకు చల్ది అన్నం, బెల్లం సమర్పించారు. అనంతరం మేళా తాళాల నడుమ సంప్రదాయబద్ధంగా ఘటాలతో ఊరేగింపుగా గ్రామ వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. గణాచారుల పాదాలకు మహిళలు వేపల ఆకులతో కూడిన పసుపు నీళ్లను పోసారు. మహిళలు, కుటుంబ సభ్యులు మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటి సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



భీమడోలులో వస్త్రాలు పరిచి గణాచారులకు స్వాగతం పలుకుతున్న భక్తులు

మధ్యాహ్న భోజనాన్ని రుచిగా సిద్ధం చేయాలి

భీమడోలు: పరీక్షల వేళ మధ్యాహ్న భోజనాన్ని మరింత రుచి, శుచిగా తయారు చేయించే బాధ్యత సంబంధిత హెచ్‌ఎంలపై ఉందని ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారిణి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. గుండుగొలను జెడ్పీ ఉన్నత పాఠశాలను సోమవారం ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్‌తో కలిసి ఆమె ఆకస్మికంగా సందర్శించారు. టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్షల నిర్వహణ, ఎండీఎం తయారీ, పరీక్షాపే చర్చ తదితర అంశాలను ఆమె పరిశీలించారు. వండిన బిర్యానీ, వంకాయ, టమాటా, ఉడకబెట్టిన కోడిగుడ్ల నాణ్యతను పరిశీలించి ఎండీఎం నిర్వాహకులకు పలు సూచనలందించారు. పాఠశాలకు హాజరైన ప్రతి విద్యార్థి భోజనం చేసేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఎండీఎంలో అలసత్వం వహిస్తే ఎండీఎం నిర్వాహకులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యార్థులకు సూచనలు

తొలుత తెలుగు టెన్త్ ప్రీ పబ్లిక్ పరీక్ష నిర్వహణను పరిశీలించి విద్యార్థులకు పలు సూచనలందించారు. పాఠశాలలోని 155 మంది పరీక్షలు రాస్తున్నాయని డీఈవోకు హెచ్‌ఎం గారపాటి కనకదుర్గ సునీత వివరించారు. డీఈవో మాట్లాడుతూ పరీక్షలంటే భయపడవద్దని, ఒత్తిడిని జయిస్తే లక్ష్యాన్ని సాధించడం సులువేనని అన్నారు. టెన్త్ క్లాస్ జీవితానికి మలుపు అని, నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు తెలి పారు. అనంతరం చిన్నారులు, టీచర్లతో కలిసి ఆమె పరీక్షా పే చర్చలో పాల్గొని నరేంద్ర మోడీ ప్రసంగాన్ని తిలకించారు. ఎంఈవో అయినపర్తి భాస్కర్‌కుమార్ పాల్గొన్నారు.



గుండుగొలనులో ఆహార పదార్థాల తయారీని పరిశీలిస్తున్న డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ

పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే కొఠారు పరామర్శ

పెదవేగి : ఇటీవల పలువురు వైఎస్సార్ సీపీ నేతలు మృతిచెందడంతో ఆయా కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పరామర్శించి అండగా ఉంటానని భరోసా కల్పించారు. పెదవేగి మండలం అంకన్నగూడెం గ్రామ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ పిల్లి రామకృష్ణ సంతాప సభ సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అబ్బయ్యచౌదరి తదితరులు రామకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారికి వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని అబ్బయ్య చౌదరి తెలియజేశారు. అనంతరం పెదవేగి మండలం సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ తాతా సత్యనారాయణ ఇటీవల మృతి చెందడంతో ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఎంపీటీసీ సభ్యుడు, మండల విప్ పిల్లి రామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

సామ్రాజ్యంకు ఘన నివాళులు

దెందులూరు: గోపన్నపాలెం ఎంపీటీసీ సువ్వా ప్రభుదాసు మాతృమూర్తి సామ్రాజ్యం ఆకస్మిక మరణం ఎంతో బాధించిందని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. సోమ వారం వేగవరంలోని ఎంపీటీసీ నివాసానికి ఆయన వెళ్లి ప్రభుదాసు కుటుంబ సభ్యులను బంధువులను పరామర్శించారు. సామ్రాజ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీటీసీ కుటుంబానికి వ్యక్తిగతంగా పార్టీ పరంగా అండగా ఉంటామని అబ్బయ్య చౌదరి భరోసా ఇచ్చారు. ఆయన వెంట దెందులూరు, పెదపాడు, పెదవేగి, ఏలూరు రూరల్ మండలాల్లోని వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

అచ్చమ్మ తల్లికి తమలపాకులతో అలంకరణ

దెందులూరు: గాలయిగూడెంలోని అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు శర్మ అచ్చమ్మ పేరంటాలు తల్లికి తమలపాకులతో ప్రత్యేక అలంకరణ చేశారు. అమ్మవారి ఉత్సవాలు ఏడవ రోజు వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనం కోసం ఆలయంలో బారులు తీరారు. అనంతరం భక్తులకు ఆలయ అర్చకులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని భీమ నాగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకాలంకరణ చేశారు.





ప్రత్యేక అలంకరణలో గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ, డ్రైఫ్రూట్స్‌తో స్వామివారికి అలంకరణ

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బస్సుల్లో సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్న జిల్లాలోని ధర్మాజీగూడెం హోలీ ట్రినిటీ స్కూల్, అనన్య స్కూల్ యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పీఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు జీవన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఉప రవాణా కమిషనర్ షేక్ కరీమ్‌కు వినతిపత్రంఅందజేశారు. విద్యాసంస్థల యాజమాన్యాలు బస్సుల ఫీజు వేలకు వేలు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి దోచుకుంటున్నారని, బస్సులో పిల్లలకు కూర్చోవడానికి కూడా లేకుండా ఒకరిపై ఒకరిని కుక్కేశారని తరలిస్తున్నట్టు తమ పరిశీలనలో తేలిందని వివరించారు. పిల్లల ప్రాణాల పట్ల బాధ్యత లేకుండా బస్సుల్లో ఓవర్ లోడ్ చేసి నడుపుతున్నారని తెలిపారు. కొన్ని బస్సులకు పర్మిషన్లు లేవని, మరికొన్ని బస్సులకు ఎఫ్సీలు కూడా డేట్ అయిపోయని వివరించారు. అధికారులు వెంటనే తనిఖీ చేసి కండిషన్ సరిగ్గా లేని బస్సులను సీజ్ చేయాలని, పరిమితి మేరకే బస్సులో పిల్లలను ఎక్కించుకునే విధంగా ఆయా స్కూళ్లకు నోటీసులు జారీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.



డీటీసీకి వినతిపత్రం సమర్పిస్తున్న పీఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

నులిపురుగుల నివారణతో ఆరోగ్యం

భీమడోలు: నులిపురుగుల నివారణ ద్వారా సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని భీమడోలు ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం గుండుగొలను, పూళ్ల పీహెచ్ పరిధిల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 19 ఏళ్లలోపు బాలబాలికలకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసారు. భీమడోలు మానస ఇంగ్లీషు మీడియం పాఠశాలు, భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఎంపీడీవో సీహెచ్ పద్మావతిదేవి మాత్రలను చిన్నారులతో మింగించారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వైద్యాధికారిణి కె.శ్రీలక్ష్మీ మాత్రలు వేసారు. గుండుగొలను పీహెచ్‌సీ పరిధిలో 10,759 మంది బాలబాలికల్లో 98 శాతం మంది వేసుకున్నారు. పూళ్ల పీహెచ్‌సీలో 4,038 బాలబాలికల్లో 3,966 మంది మాత్రలు వేసుకున్నారు. 98.2 శాతం నమోదైందన్నారు. మిగిలిన వారికి ఈనెల 17న మాత్రలను పంపిణీ చేస్తామని వైద్య ఆరోగ్య సిబ్బంది తెలిపారు. గ్రామ కార్యదర్శి కేవీఎల్ తనూజ, మానస ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్రకుమార్, సీహెచ్‌వోలు, సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.



గుండుగొలనులో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి కె.శ్రీలక్ష్మి

నులిపురుగులతో అనారోగ్య సమస్యలు

గణపవరం: పిల్లల్లో అన్ని అనారోగ్య సమస్యలకు మూలం నులి పురుగులేనని, వీటి నిర్మూలతో ఆరోగ్యవంతులుగా ఉండవచ్చునని గణపవరం ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి, వైద్యాధికారి పులపర్తి సంతోష్ అన్నారు. సోమవారం జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా గణపవరం పీహెచ్‌సీ, బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. మండలంలో 5,920 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వవలసి ఉండగా సోమవారం 5,755 మంది పిల్లలకు మాత్రలు వేశామని, మిగిలిన వారికి రెండో విడతలో మాత్రలు వేస్తామని ఎంపీడీవో శ్రీలక్ష్మి తెలిపారు. ఎంఈవో గొర్రెల బాలయ్య, బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి, పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి.కిరణ్మయి, పీహెచ్‌సీ సీహెచ్‌వో జాలాది విల్సన్ పాల్గొన్నారు.

బువ్వనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో..

నిడమర్రులో: బువ్వనపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో డీవార్మింగ్ డే సందర్భంగా సోమవారం విద్యార్థులకు నిడమర్రు ఎంఈవో ఈదుపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎస్.ఏసుబాబు, ఉపాధ్యాయులు ఎన్‌వీ సుబ్బారావు, ఏఆర్‌కే కుమార్, ఎస్.రాము, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా 35 ప్రాథమిక, 7 ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్లు ఎంఈవో తెలిపారు.

నులిపురుగు నివారణ మందు పంపిణీ

పెదపాడు: విద్యార్థులు తప్పనిసరిగా నులి పురుగు నివారణ మందు వేసుకోవాలని డీపీఎంఓ డాక్టరు చక్రధర్ తెలిపారు. డీవార్మింగ్ డే సందర్భంగా పెదపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నులిపురుగుల మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా డాక్టరు చక్రధర్ మాట్లాడుతూ సోమవారం గైర్హాజరు అయిన విద్యార్థులకు ఫిబ్రవరి 17న నిర్వహించనున్నట్లు చెప్పా రు. మండలంలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసామని చెప్పారు. ప్రధానోపాధ్యాయుడు పీ వెంకటేశ్వరరావు,డాక్టరు అనంత పాల్, ఎంపీడీవో అమీల్ జమా, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.